సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 14 । నవంబర్ । 2023



పారాహుషార్!

అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ఘట్టం పూర్తవ్వడంతో గ్రామాల్లో ఎన్నికల వేడి రాజుకుంది.

వివరాలు 10లో ▸



ఓటు హక్కుపై కళాజాత

ఓటు హక్కు వినియోగించుకోవాలని జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్‌లో సోమవారం అధికారులు కళాజాత నిర్వహించారు.

వివరాలు 10లో ▸



ఆరు గ్యారంటీలను నమ్మొద్దు

కాంగ్రెస్ ఆరు గ్యారంటీల హామీలను ప్రజలు నమ్మొద్దని బీఆర్ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

అన్నారం పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

సంగారెడ్డి టౌన్: అన్నారం పంచాయతీ కార్యదర్శి జీఎం సుదర్శన్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ప్రభుత్వ భూమిలో ఆరుగురు ప్రైవేటు వ్యక్తులకు ఇంటి నంబర్లు కేటాయించడంపై విచారణ చేపట్టగా వాస్తవమేనని తేలడంతో కలెక్టర్ శరత్ సోమవారం సెస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అతను తన రక్త సంబంధీకులకు, ఒక వార్డు సభ్యుడి బంధువులకు ప్రభుత్వ భూమిలో ఇంటి నంబర్లు కేటాయించారని ఇన్‌చార్జి సర్పంచ్ ఫిర్యాదు చేయగా, గుమ్మడిదల పంచాయతీ అధికారి విచారించి నివేదిక సమర్పించాలని ఆదేశించామన్నారు. అందులో నేరం రుజువు కావడంతో తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి నివేదికను సమర్పించాలని డివిజనల్ పంచాయతీ అధికారిని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

'క్రాంతి కిరణ్ అఫిడవిట్‌పై హైకోర్టుకు వెళ్తాం'



మాట్లాడుతున్న డాక్టర్ వీరన్న, న్యాయవాదులు

జోగిపేట (అందోల్): బీఆర్ఎస్ అభ్యర్థి క్రాంతి కిరణ్ సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో కుటుంబ సభ్యుల వివరాలు, ఆదాయ వివరాలు పేర్కొన లేదని, దీంతో ఆయన నామినేషన్‌ను తిరస్కరించాలని కాంగ్రెస్ అభ్యర్థి ఏజెంట్ అద్దంకి వీరన్న, హైకోర్టు న్యాయవాదులు రాంబాబు, శ్రీధర్ డిమాండ్ చేశారు. సోమవారం నామినేషన్‌ల పరిశీలన సమయంలో రిటర్నింగ్ అధికారి పాండుకు ఫిర్యాదు చేశారు. క్రాంతి కిరణ్ నామినేషన్ పత్రాల్లో పొందుపరిచిన అఫిడవిట్‌లో పూర్తి వివరాలను ఇవ్వలేదన్నారు. 2021–22కు సంబంధించి వార్షిక ఆదాయం జీరోగా చూపించారన్నారు. ఎమ్మెల్యేగా ప్రభుత్వ వేతనాన్ని తీసుకోలేదా? ఆయన పేరిట ఉన్న 5 ఎకరాల భూమికి తీసుకున్న రైతుబంధును వాపస్ చేశారా? అని ప్రశ్నించారు. ఆయన కుమారుడు చంటి ఆశాంక్ మైనర్ అని ఇది కూడా అవిడవిట్‌లో పేర్కొనలేదని తెలిపారు. నామినేషన్ తిరస్కరించాలని కోరుతూ ఫిర్యాదు చేశామన్నారు. మూడు రోజుల్లో చర్యలు తీసుకోనట్లయితే హైకోర్టుకు వెళతామని తెలిపారు. ఈ విషయంలో కలెక్టర్‌కు, రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

అభివృద్ధిలో ముందంజ


బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్



చింతా ప్రభాకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నేతలు

సదాశివపేట(సంగారెడ్డి): అభివృద్ధిలో తెలంగాణ దూసుకుపోతోందని సంగారెడ్డి అభ్యర్థి చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం చందాపూర్, ఎన్కెపల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్‌కు చెందిన మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, నాయకులు కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాను ఎప్పుడూ ప్రజల మధ్యే ఉన్నానని, ఒక్క అవకాశం ఇస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేపడతానన్నారు. మున్సిపల్ కౌన్సిలర్ విశ్వనాథం ఆధ్వర్యంలో చందాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ మాజీ ఎంపీటీసీ మాణేయ్య, బీజేపీకి చెందిన 200 మంది చేరారు. ఎన్కెపల్లి మాజీ సర్పంచ్, మార్కెట్ డైరెక్టర్ రాములు ముదిరాజ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఫారుక్, నాయకులు కార్యకర్తలు 50 మంది సైతం చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, ఎంపీటీసీ అహ్మద్, సర్పంచ్ శేఖర్, మాజీ మండల కోఆప్షన్ మెంబర్ సలావుద్దీన్, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వలలో చిక్కుకొని వ్యక్తి మృతి



యాదయ్య

వట్‌పల్లి(అందోల్): చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని ఖాదిరాబాద్‌లో చోటుచేసుకుంది. ఏఎస్ఐ విఠల్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొన్యాల యాదయ్య(40) ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో మంజీరా నదిలో చేపల వేటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాలేదు. సోమవారం గ్రామానికి చెందిన వ్యక్తి నది వద్దకు వెళ్లగా వలలో చిక్కుకొని అతడు మరణించి ఉండటాన్ని గమనించాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. యాదయ్య తల్లి లచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

లాభమా.. నష్టమా?

స్వతంత్ర అభ్యర్థుల ఓట్లపై విశ్లేషణలు

- నష్టం చేకూరేలా ఉంటే విత్‌డ్రా కోసం విజ్ఞప్తి
- మేలు జరిగేలావుంటే ప్రోత్సాహం
- బేరీజు వేసుకుంటున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన వారికి వచ్చే ఓట్లు తమకు నష్టం చేస్తాయా? మేలు చేస్తాయా? వారు బరిలో ఉంటే తమకు పడాల్సిన ఓట్లు చీలిపోతాయా? లేదంటే వ్యతిరేకత ఓటు చీలి పోయి మేలు జరుగుతుందా? ఇలా ప్రధాన పార్టీల అభ్యర్థులు లోతైన విశ్లేషణల్లో నిమగ్నమయ్యారు. తమ గెలుపు కోసం పకడ్బందీ వ్యూహాలతో ముందుకెళుతున్న అభ్యర్థులు ఏ చిన్న అవకాశం దొరికినా నిర్లక్ష్యం చేయడం లేదు. నష్టం చేసే అవకాశాలున్న చోట్ల స్వతంత్రులతో నామినేషన్లు ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లాభం చేకూర్చే అవకాశాలుంటే బరిలో ఉండాలని ప్రోత్సహిస్తున్నారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో నామినేషన్ల పర్వం ముగిసింది. ప్రస్తుతం పరిశీలన కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 11 అసెంబ్లీ స్థానాలకు గాను అన్ని చోట్ల స్వతంత్రులు నామినేషన్లు దాఖలు చేశారు. కొందరు స్వతంత్రులు తమ సమస్యను ప్రజల దృష్టికి తెచ్చేందుకు, మరికొందరు ప్రతి ఎన్నికల్లో బరిలో ఉండాలని నామినేషన్లు వేస్తుంటారు. ఇలా ఈసారి కూడా కొందరు నామినేషన్లు వేశారు.

బ్యాలెట్ యూనిట్లు పెంచాల్సిన పరిస్థితి

బరిలో ఉన్న అభ్యర్థుల సంఖ్య పెరిగితే బ్యాలెట్ యూనిట్లను పెంచాల్సిన అవసరం ఉంటుంది. నిర్ణీత సంఖ్య లోపు అభ్యర్థులుంటే ఒక్క బ్యాలెట్ యూనిట్ సరిపెట్టొచ్చు. కానీ ఎక్కువ మంది ఉంటే బ్యాలెట్ యూనిట్లను పెంచాల్సి ఉంటుంది. దీంతో ఓటర్లు అభ్యర్థుల గుర్తులను వెతుక్కోవడంలో కొంత మేరకు అయోమయం నెలకొనే అవకాశం ఉంటుంది.

రేపటితో ముగియనున్న గడువు

నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ముగియనుంది. ఈ నేపథ్యంలో సమయం తక్కువగా ఉండటంతో వీలైనంత ఎక్కువ మంది స్వతంత్రులతో నామినేషన్లను ఉపసంహరించుకునేలా చేస్తే వీలైనంత ఎక్కువ మెజారిటీ సాధించవచ్చని ప్రధాన పార్టీల అభ్యర్థులు భావిస్తున్నారు. ఉపసంహరణకు కేవలం ఒక రోజే గడువు ఉండటంతో అభ్యర్థులు.. స్వతంత్రులను కలిసి నామినేషన్లు ఉపసంహరించుకోవాలని కోరుతున్నారు.

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని..

గతంలో స్వతంత్ర అభ్యర్థుల కారణంగా కొందరు ప్రధాన పార్టీల అభ్యర్థుల భవితవ్యం మారిపోయింది. ప్రధాన పార్టీల అభ్యర్థుల గుర్తును పోలిన గుర్తులు వీరికి కేటాయించడంతో తీవ్రంగా నష్టపోయారు. తమకు పడాల్సిన ఓట్లు వేలల్లో స్వతంత్రులకు పడ్డాయని వారు భావిస్తున్నారు. కొన్ని చోట్ల అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం పడిందని రాజకీయ విశ్లేషకులు సైతం అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికల్లోనూ ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

నియోజకవర్గం	అభ్యర్థుల సంఖ్య	దాఖలైన నామినేషన్లు
హుస్నాబాద్	44	52
సిద్దిపేట	62	76
మెదక్	24	29
నారాయణఖేడ్	29	35
అందోల్ (ఎస్సీ)	34	38
నర్సాపూర్	24	29
జహీరాబాద్ (ఎస్సీ)	44	48
సంగారెడ్డి	44	51
దుబ్బాక	34	38
గజ్వేల్	145	154

నియోజకవర్గాలవారీగా ఫెసిలిటేషన్ సెంటర్

జిల్లా ఎన్నికల అధికారి శరత్



మాట్లాడుతున్న శరత్

సంగారెడ్డి టౌన్: ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలా పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి శరత్ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. సోమవారం తన క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏఆర్‌ఓలు, నోడల్ అధికారులు, తదితరులతో కలిసి ఆయన ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. పోలింగ్ విధుల్లో ఉండే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఇచ్చి స్వీకరించాలని, ఇది రేపటిలోగా పూర్తి కావాలని చెప్పారు. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా సహకరించాలని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీసం మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 80 సంవత్సరాల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, అత్యవసర సేవల విభాగపు సిబ్బందికి ఓటు వేసుకునే అవకాశం కల్పించాలన్నారు. నియోజకవర్గంవారీగా ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సి–విజిల్ ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించాలని, లేనట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నగదు, లిక్కర్, గిఫ్టులు, చీరలు, కుక్కర్లు, తదితర వాస్తు సామగ్రి పంపిణీలపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల నియమావళికి సంబంధించి ఉల్లంఘనలు ఎక్కడా జరగకుండా చూసుకోవాలన్నారు. వెబ్ కాస్టింగ్, కౌంటింగ్ సెంటర్ ఫైనలైజేషన్ తదితర ప్రతిపాదనలు అందజేయాలని వెల్లడించారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వివరాలు ఇవ్వాలన్నారు. ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ బాధ్యత సెక్టోరల్ అధికారులు, ఏఆర్‌ఓలదేనని స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌ఓ నగేశ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ ఎస్ఈలు, నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, ఏఆర్‌ఓలు, విద్యుత్, మున్సిపల్ కమిషనర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, వైద్యారోగ్య శాఖ మెడికల్ ఆఫీసర్లు, ఎన్నికల విభాగపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టిక్కర్ ఆవిష్కరణ



పోలింగ్ స్టిక్కర్‌ను ఆవిష్కరిస్తున్న శరత్, అధికారులు

జిల్లాలో గల ఓటర్లు ఈనెల 30వ తేదీని గుర్తుంచుకుని, కచ్చితంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ శరత్ పిలుపునిచ్చారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా పోలింగ్ తేదీకి సంబంధించిన స్టిక్కర్‌ను సోమవారం తన చాంబర్‌లో అదనపు కలెక్టర్లతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ, ప్రతి ఇంటింటికీ పోలింగ్ తేదీ స్టిక్కర్‌ను అతికించి అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మాధురి, స్వీప్ నోడల్ అధికారి అఖిలేశ్‌రెడ్డి, డీఆర్‌ఓ నగేశ్, ఇతర నోడల్ అధికారులు పాల్గొన్నారు.

కళ్లెదుటే కన్నపేగు ఛిద్రం

- టపాసులు కొనేందుకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం..
- తల్లి ఎదుటే ఇద్దరు కుమారులు మృతి
- స్కూటీని ఢీకొట్టిన టిప్పర్
- కాద్లూర్‌లో విషాదఛాయలు



ప్రణయ్‌తేజ్, పృథ్వీతేజ్ (ఫైల్)

మెదక్ మున్సిపాలిటీ : దీపావళి ప్రతీ ఇంట్లో వెలుగులు తెస్తే.. ఆ కుటుంబంలోకి మాత్రం చీకటి తెచ్చింది. పండుగ రోజు టపాసులు కొనేందుకు తల్లి, ఇద్దరు కుమారులతో కలిసి స్కూటీపై వెళ్తుండగా టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు టైర్ కిందపడి మృతి చెందారు. ఈ విషాదకర ఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. టేక్మాల్ మండలం కాద్లూర్ గ్రామానికి చెందిన అన్నపూర్ణ మెదక్ పట్టణం జంబికుంటలో నివాసం ఉంటున్నారు. మెదక్‌లోని కేజీబీవీలో టీచర్‌గా పని చేస్తూ పృథ్వీ తేజ్ (9), ప్రణయ్ తేజ్ (12) చదివించుకుంటూ జీవిస్తోంది. దీపావళి పండుగ కావడంతో టపాసులు కొనడానికి కుమారులతో కలిసి వడ్డెర కాలనీలో ఏర్పాటు చేసిన దుకాణాల వద్దకు స్కూటీపై వెళ్తున్నది. మార్గమధ్యలో గోల్కొండ వీధిలో ప్రధాన రోడ్డుపై స్కూటీని వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె రోడ్డు పక్కన పడింది. కుమారులు టిప్పర్ టైర్ కిందపడి అక్కడికక్కడే మృతిచెందారు. కళ్ల ముందే వారు చనిపోవడం చూసిన ఆ తల్లి గుండెలు అవిసేలా రోదించడం అక్కడ ఉన్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాలను మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించి, అనంతరం గ్రామానికి పంపించారు. టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని వదిలేసి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లి లేకుండానే అంత్యక్రియలు

టేక్మాల్(మెదక్): మెదక్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన ఇద్దరు చిన్నారుల అంత్యక్రియలు స్వగ్రామమైన కాద్లూర్‌లో తల్లి లేకుండానే జరిగాయి. కళ్ల ముందే ఇద్దరు కొడుకులు చనిపోవడం చూసిన అన్నపూర్ణ కోమాలోకి వెళ్లడంతో సంగారెడ్డిలోని పద్మావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దీపావళి పండుగ రోజే ఇద్దరు చిన్నారులు మృతి చెందడంతో కాద్లూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదంలో చనిపోయిన ప్రణయ్‌తేజ్ (12) మెదక్ గీతా పాఠశాలలో 7వ తరగతి చదువుతుండగా, పృథ్వీ తేజ్ (9) తుప్రాన్ గీతా పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు.

13 నామినేషన్ల తిరస్కరణ

జిల్లాలో మూడు నియోజకవర్గాల నుంచి 13 నామినేషన్లు తిరస్కరించారు. పటాన్‌చెరులో 9, నారాయణఖేడ్, జహీరాబాద్‌లో రెండు చొప్పున తిరస్కరణకు గురయ్యాయి.



నారాయణఖేడ్: స్క్రూటినీ నిర్వహిస్తున్న ఈఆర్వో, అధికారులు

పటాన్‌చెరు టౌన్: నియోజకవర్గంలో 34 మంది అభ్యర్థులు 52 సెట్లు నామినేషన్లు వేయగా సోమవారం ఎన్నికల అధికారులు స్క్రూటినీ నిర్వహించారు. తొమ్మిదింటిని తిరస్కరించారు. బీఎస్పీ నుంచి నీలం మధు ముదిరాజ్ నామినేషన్ వేసి బీఫామ్ సమర్పించగా, అంతకు ముందు కాంగ్రెస్ తరఫున వేసిన సెట్ తిరస్కరించారు. అలియన్స్ డెమోక్రటిక్ రిఫార్మర్స్ పార్టీ నామినేషన్ వేసిన శ్రీశైలంయాదవ్ బీఫాం సమర్పించగా, స్వతంత్ర అభ్యర్థిగా వేసిన మరో సెట్ తిరస్కరించారు. స్వతంత్ర అభ్యర్థులు యాదగిరి, సత్యనారాయణ, బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి తరఫున ఎమ్మెల్యే సతీమణి యాదమ్మ, బీజేపీ అభ్యర్థి గౌడ్ సతీమణి సంధ్య, కాంగ్రెస్ అభ్యర్థి కాటా శ్రీనివాగౌడ్ సతీమణి సుధ, యుగ తులసి పార్టీ అభ్యర్థి నిఖిల్ గౌడ్ నామినేషన్లు వేయగా తదితర కారణాలతో తిరస్కరించారు. సీపీఎం అభ్యర్థిగా మల్లికార్జున్ నామినేషన్ ఆమోదించగా, నర్సింహారెడ్డి వేసిన రెండో సెట్‌ను తిరస్కరించారు. మిగతా 25 మంది అభ్యర్థులు నామినేషన్లు ఆమోదం పొందాయని ఆర్‌ఓ దేవుజా తెలిపారు.

ఖేడ్‌లో రెండు ...

నారాయణఖేడ్: పట్టణంలో సోమవారం నిర్వహించిన స్క్రూటినిలో రెండు నామినేషన్లను తిరస్కరించి, 20 ఆమోదించినట్లు ఈఆర్వో వెంకటేశ్ తెలిపారు. మొత్తం 22 మంది 35 సెట్లు దాఖలు చేశారని తెలిపారు. కాంగ్రెస్ తరఫున నామినేషన్ దాఖలు చేసిన సురేశ్ షెట్కార్, బీఆర్ఎస్ తరఫున నామినేషన్ దాఖలు చేసిన మహారెడ్డి శ్రేయారెడ్డి సెట్లను తిరస్కరించామని తెలిపారు.

జహీరాబాద్‌లో..

జహీరాబాద్: అసెంబ్లీ స్థానానికి వచ్చిన 30 నామినేషన్లలో రెండింటిని తిరస్కరించినట్లు ఆర్‌ఓ వెంకారెడ్డి తెలిపారు. కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థి ఆగమ ప్రమీల, బీఎస్పీ అభ్యర్థి బేగరి సిద్దన్న నామినేషన్లను తదితర కారణాలతో నామినేషన్లు తిరస్కరించినట్లు పేర్కొన్నారు.

వాలీబాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

పుల్‌కల్(అందోల్): అండర్–19 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు బస్వాపూర్ మోడల్ కాలేజీ విద్యార్థి సాజన్‌బాబు ఎంపికయ్యాడు. వచ్చే నెలలో గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని పీడీ రాజు తెలిపారు. క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరిగాయి. ఎంపికైన వారందరూ నేషనల్ లెవల్ పోటీల్లో పాల్గొననున్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సంక్షేమం

సదాశివపేట(సంగారెడ్డి): బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్, బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర నాయకుడు శివరాజ్‌పాటిల్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పెద్దాపూర్ ఎంపీటీసీ ముత్యని అనంతమ్మ రాములు, కాంగ్రెస్ చందాపూర్ మాజీ ఎంపీటీసీ పెద్దగొల్ల బక్కన్న పార్టీలో చేరారు. మరోసారి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సేనని అందరూ కలిసి అభ్యర్థి చింతా ప్రభాకర్ గెలుపునకు పూర్తిగా సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీలో అగ్నిప్రమాదం

- ఏడుగురికి గాయాలు
- వారిలో నలుగురు కార్మికులు, మరో ముగ్గురు ఫైర్ సిబ్బంది
- పాశమైలారంలో ఘటన



పరిశ్రమ వద్ద ఎగిసిపడుతున్న మంటలు



చికిత్స పొందుతున్న మహేశ్ సింగ్

పటాన్‌చెరు టౌన్: మండలంలో ఉన్న పాశమైలారం పారిశ్రామికవాడ ఆదిత్య ఫార్మా పరిశ్రమలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో ముగ్గురికి తీవ్రగాయాలు, ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. మంటలు ఆర్పేందుకు వచ్చిన ఫైర్ సిబ్బందిలో ముగ్గురు సైతం గాయపడ్డారు. ఈ సంఘటన భానూర్ బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం... ఈ పరిశ్రమ పౌడర్ తెచ్చి రసాయనాలు తయారు చేసి మిశ్రమం చేస్తోంది. ఎప్పటిలాగే మిశ్రమం చేస్తున్న సమయంలో అకస్మాత్తుగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో బిహార్‌కు చెందిన కార్మికులు అన్సీలాల్, మహేశ్ సింగ్, లాల్‌జీ తీవ్రంగా గాయపడ్డారు. రాజ్ సింగ్ కు స్వల్పగాయాలయ్యాయి. ఐలా నుంచి రెండు అగ్నిమాపక శకటాలు, పటాన్‌చెరు నుంచి మరొకటి చేరుకుంది. సిబ్బంది గంటపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. కాగా ఆర్పే క్రమంలో విద్యుతాఘాతానికి గురై పాశమైలారం అగ్నిమాపక సిబ్బంది సందీప్, పింటూ, సుశాంత్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులందరినీ చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిని కాకతీయ ఆస్పత్రి తరలించారు. అందులో మహేశ్‌ను హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే పరిశ్రమకు ఎటువంటి అగ్ని ప్రమాద నివారణ ఎక్విప్మెంట్ వాడలేదని జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరిశ్రమ పేరుతో బోర్డు బయట ప్రదర్శించలేదు. దీంతో అసలు రసాయనాలు మిశ్రమం చేసేందుకు అనుమతి ఉందా? లేదా? అనే అనుమానం స్థానికుల వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ దందాపై నిఘా

ఎస్పీ రూపేశ్

జహీరాబాద్ టౌన్: జిల్లాలో అక్రమ దందాను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ రూపేశ్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుట్కా, మద్యం, డ్రగ్స్, బంగారం తదితరాల అక్రమ రవాణా అరికట్టడానికి జిల్లాలో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఎనిమిది బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఆ మేరకు ప్రత్యేక బలగాలను మోహరించామన్నారు. ప్రజలు ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటు హక్కు వినియోగించుకొనేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డబ్బులు, మద్యం పంపిణీకి సంబంధించి విషయాలపై ఫిర్యాదు చేస్తే చర్యలు వెంటనే తీసుకుంటామని పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీలో ఉన్న ఓ ఇంట్లో ఇటీవల జరిగిన దొంగతనం కేసులో 13 తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేశామన్నారు. దొంగల్లో మైనర్ కూడా ఉన్నాడని చెప్పారు. అతడిని బాలాసాదానికి పంపామన్నారు. పేకాట స్థావరాలపై రెండు, మూడు రోజులపాటు ప్రత్యేక నిఘా ఉంచి జూదరులను అరెస్టు చేస్తామన్నారు. సమావేశంలో డీఎస్పీ రఘు, సీఐ, రాజు,ఎస్ఐ, శ్రీకాంత్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్



అమృతగుండంలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



శివోహం

దక్షిణకాశీగా పేరొందిన కేతకీ సంగమేశ్వర ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. ఆది, సోమవారాల్లో అమావాస్యను పురస్కరించుకొని తెలుగు రాష్ట్రాలు సహా కర్ణాటక, మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమృత గుండంలో పవిత్ర పుణ్యస్నానాలు ఆచరించారు. అందులోని జలలింగానికి పూజలు చేశారు. అనంతరం క్యూలో గంటల తరబడి వేచి ఉండి పార్వతీపరమేశ్వరుల దర్శించుకున్నారు. అభిషేకం, కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

– ఝరాసంగం(జహీరాబాద్)



క్యూలో భక్తులు

క్లుప్తంగా

ఆరు గ్యారంటీలను కాపీ కొడుతున్నారు

సిద్దిపేటజోన్: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలను బీఆర్ఎస్ కాపీ కొట్టి లబ్ధి పొందాలని చూస్తుందని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన స్థానిక 8, 9, 10వార్డులలో ఆ పార్టీ అభ్యర్థి హరికృష్ణకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒక్కసారి సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. సిద్దిపేట ప్రగతి, కోమటి చెరువు సుందరీకరణకు చేసిన ఖర్చు పై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్‌లను కేటాయించలేదని అన్నారు. కార్యక్రమంలో యాదగిరి లక్ష్మీ, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కు గుణపాఠం చెప్పాలి

దౌల్తాబాద్(దుబ్బాక): బీసీలను, ఎస్సీలను మోసం చేసిన సీఎం కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పాలని దుబ్బాక బీఎస్పీ అభ్యర్థి సల్కం మల్లేశంయాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని పోసాన్‌పల్లి, గువ్వలేగి, ఉప్పరపల్లి, గోవిందాపూర్ తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఎస్పీ దుబ్బాక నియోజకవర్గ నాయకుడు సంజీవ్, మండల అధ్యక్షుడు నర్సింహులు, బీఎస్పీ నాయకులు బొల్లం రాజేశ్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై కళాజాత



కార్యక్రమంలో పాల్గొన్న సంగారెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో సోమవారం మున్సిపల్ అధికారులు ఓటు హక్కు వినియోగించుకోవాలని కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. పాటల రూపంలో కళాకారులు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, ఆర్ఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన



అమ్మవారి సన్నిధిలో దయాల్ గంగువార్

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని అన్నారం, బొంతపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల పరిశీలకుడు దయాల్ గంగువార్ సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల నిర్వహణ తదితర విషయాలపై అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం బొంతపల్లిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ పోటీలు



ప్రథమ స్థానంలో నిలిచిన రంగారెడ్డి జిల్లా క్రీడాకారులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: అండర్–19 ఎస్‌జీఎఫ్ పోటీలు ఆదివారం ముగిశాయి. పట్టణంలో ఈ నెల 10 నుంచి 12 వరకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. బాలుర విభాగంలో రంగారెడ్డి ప్రథమ, వరంగల్ ద్వితీయ, ఖమ్మం తృతీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ ప్రథమ, కరీంనగర్ ద్వితీయ, నిజామాబాద్ తృతీయ స్థానంలో నిలిచాయి.

పారాహుషార్!

- హద్దు దాటొద్దు.. నోరు జారొద్దు
- వ్యక్తిగత దూషణలు, విమర్శలు నేరం
- ప్రచారంలో అభ్యర్థులు జర జాగ్రత్త



నారాయణఖేడ్: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ఘట్టం పూర్తవ్వడంతో గ్రామాల్లో ఎన్నికల వేడి రాజుకుంది. పార్టీలు ప్రకటించిన అభ్యర్థులు, స్వతంత్రంగా పోటీ చేస్తున్న వారు ప్రచార పర్వంలో దూసుకుపోతున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో కొందరు అభ్యర్థులు లక్ష్మణరేఖ దాటుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాము గెలుపొందితే ప్రజలకు, సమాజానికి ఎటువంటి ఉపయోగకర పనులు చేస్తామో చెప్పుకోవాలి. ఇలా కాకుండా వ్యక్తిగత దూషణలకు దిగడం, కుల, మత పరమైన ఉద్రేకాలు రెచ్చగొట్టేలా మాట్లడటం నిషేధం. అభ్యర్థులు ఎవరైనా అలా ప్రవర్తిస్తే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చు. దీనికి ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబరు, యాప్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను జారీ చేసింది. వాటిని కచ్చితంగా పాటించాలని సూచించింది. కట్టుతప్పితే వాటిపై అధికారుల నిఘాతోపాటు ప్రత్యర్థుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికే ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై పార్టీల నేతలకు అభ్యర్థులకు అవగాహన కల్పించారు.

ఇవి గుర్తుంచుకోండి..



అప్పటికే ఉన్న విభేదాలను మరింత రెచ్చగొట్టేలా, పరస్పర ద్వేషాన్ని పెంచేలా ప్రసంగించడం.. కులాలు, జాతుల మధ్య మత పరమైన, భాషాపరమైన ఉద్రేకాలను సృష్టించేలా ఏ పార్టీ అభ్యర్థులు ప్రవర్తించకూడదు.

◆ ప్రత్యర్థి పార్టీ విధానాలు, కార్యకలాపాలపై మాత్రమే విమర్శలు చేయాలి. వ్యక్తిగత జీవితంపై మాట్లాడరాదు.

◆ ఓట్లను పొందేందుకు కులం, మతపరమైన భావాల పరంగా అభ్యర్థనలు చేయకూడదు. ప్రచారం కోసం ఏ మతం ప్రార్థనా మందిరాలను మరే ఇతర ఆరాధన ప్రదేశాలను వేదికగా ఉపయోగించరాదు. అలా చేస్తే ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందికే వస్తుంది.

◆ ఓటర్లను ప్రలోభ పెట్టడం, బహుమతులు ఇవ్వడం, బెదిరించడం, అసలు ఓటర్లకు బదులుగా వేరే వ్యక్తులను ఓటర్లుగా చూపించడం తప్పు. పోలింగ్ స్టేషన్‌కు 100 మీటర్ల పరిధిలో ప్రచారం చేయడం, పోలింగ్ సమయానికి 48 గంటల ముందు నుంచి బహిరంగ సభలు ఏర్పాటుకు అవకాశం లేదు.

◆ శాంతియుత గృహ జీవనం ప్రతి వ్యక్తి హక్కు. వ్యక్తుల ఇంటి ఎదుట వ్యతిరేక ప్రదర్శనలు, పికెటింగ్‌లకు దిగడం లక్ష్మణరేఖ దాటడమే అవుతుంది.

◆ పార్టీల జెండాలు పాతడం, బ్యానర్లు కట్టడం, నోటీసులు అతికించడం, నినాదాలు రాయడం ఇతరత్రా పనులకు స్థల, భవన యజమాని అనుమతి తీసుకోవాలి.

◆ ఇతర పార్టీలు నిర్వహించే ఊరేగింపులు, సమావేశాలను భగ్నం చేయడం, అడ్డంకులు సృష్టించడం, భౌతిక దాడులకు దిగడం లాంటి చర్యలు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి పూర్తి విరుద్ధం.

◆ ఒక రాజకీయ పార్టీ నిర్వహించే సమావేశాలను మరో రాజకీయ పక్షానికి చెందిన కార్యకర్తలు, సానుభూతిపరులు భగ్నం చేయడం ఉల్లంఘన కిందకే వస్తుంది. ఓ పార్టీ పోస్టర్లను మరో పార్టీ తొలగించడం నేరం.

◆ ఉల్లంఘనలు గుర్తిస్తే 1950 లేదా సీ–విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

◆ ఓటు కోసం బెదిరించడం, ప్రలోభాలకు గురి చేయొద్దు. వ్యక్తుల అనుమతి లేనిదే భూములు, భవనాలు ప్రచారానికి ఉపయోగించకూడదు.

◆ ఇతర పార్టీల ఎన్నికల ప్రచారానికి, సమావేశాలకు ఆటంకం కల్గించకూడదు. కల్గిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. ఎన్నికల ప్రచార సమావేశాలకు అధికారుల నుంచి ముందుగా లిఖిత పూర్వకంగా అనుమతి పొందాలి. నిషేధాజ్ఞలు, ఆంక్షలున్న ప్రదేశాల్లో సమావేశాలు నిర్వహించకూడదు.

◆ సమావేశాల్లో మైక్, లౌడ్ స్పీకర్ల వినియోగానికి ముందస్తుగా అనుమతి తీసుకోవాలి. నిబంధనల మేరకే వాటిని వినియోగించాలి. ఊరేగింపులు, ప్రదర్శనల రూటు ముందుగానే పోలీసులకు తెలియజేయాలి.

◆ ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఊరేగింపులు నిర్వహించాలి. దిష్టిబొమ్మలు దహనం చేయకూడదు. మంత్రులు పోలింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించకూడదు. అధికార పార్టీ నేతలు ప్రచారాన్ని అధికారిక పర్యటనలతో కలిపి చేయకూడదు. అధికార యంత్రాంగాన్ని, ప్రభుత్వ వాహనాలు ప్రచారానికి వాడకూడదు.

ఓటు వేసేదెలా..

- పంచాయతీ కార్యదర్శుల ఆవేదన
- పోస్టల్ బ్యాలెట్‌కు అనర్హులు



చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటు హక్కును వినియోగించుకునేలా భారత ఎన్నికల సంఘం విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ఇందు కోసం చైతన్య సదస్సులు ఏర్పాటు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎలక్షన్ కమిషన్ పంచాయతీ కార్యదర్శులను విరివిగా వినియోగిస్తుంది. దీనివల్ల జిల్లాలో పని చేస్తున్న పంచాయితీ కార్యదర్శులు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ నెల 30న పోలింగ్ ఉండగా.. దాని నిర్వహణకు పంచాయతీ కార్యదర్శులకు విధులు కేటాయించారు. ఈ నెల 29, 30న గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో అధికారులు, ఇతర సిబ్బందికి అవసరమైన భోజనం ఇతర మౌలిక సదుపాయాల కల్పన బాధ్యత కార్యదర్శులు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. వారు నివసించే ప్రాంతానికి దూరంగా ఎన్నికల రోజున విధులు నిర్వహించాల్సి రావడంతో ఓటు వేయడానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేద్దామన్నా అవకాశం లేకుండా పోయిందని కార్యదర్శులు వాపోతున్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఎన్నికల రోజున అధికారికంగా విధుల్లో ఉన్నట్లు దరఖాస్తు ఫాం 12కు ఆర్డర్ కాపీ జత చేయాల్సి ఉండగా పై అధికారులు మాత్రం మౌఖికంగా ఆదేశాలు జారీచేయడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.



బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

కొండాపూర్(సంగారెడ్డి): అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ అభ్యర్థి చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని గొల్లపల్లి, మునిదేవునిపల్లి, మన్సాన్ పల్లి, మల్కాపూర్ , కోనాపూర్, మాదాపూర్, గంగారం, శివన్నగూడెం గ్రామాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం , విఠల్ పాల్గొన్నారు.

ఇది గ్యారంటీ దరువు



చేర్యాల(సిద్దిపేట): పట్టణంలో సోమవారం మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనగామ కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి కూతురు ప్రియాంక రెడ్డి తన తండ్రికి ఓటు వేయాలని కోరుతూ డప్పు కొట్టి, బోనమెత్తి ఓటర్లను ఆకట్టుకున్నారు. ఆమె వెంట జయ తదితరులు పాల్గొన్నారు.

చేతికందిస్తా వేడి బజ్జీలు



వర్గల్(గజ్వేల్): ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు చిత్రవిచిత్ర పనులు చేస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. సోమవారం వర్గల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి ఓ టిఫిన్ సెంటర్‌లో వేడి వేడి బజ్జీలు వేశారు. వాటిని పంచుతూ తనకే ఓటేయాలని అభ్యర్థించారు.

బీజేపీ జెండా ఎగరడం ఖాయం

ఆ పార్టీ దుబ్బాక అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు



దౌల్తాబాద్: గోవిందాపూర్‌లో రఘునందన్‌రావు ప్రచారం

దుబ్బాకటౌన్: మంత్రి హరీశ్‌రావు కల్లబొల్లి మాటలు..జిమ్మిక్కులు దుబ్బాకలో నడువవని.. కేవలం ఎన్నికలప్పుడు వచ్చి దుబ్బాక, సిద్దిపేట రెండు కళ్లు అని మాట్లాడడమే తప్ప హరీశ్ ఏనాడూ అభివృద్ధికి కృషి చేసింది లేదని బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు విమర్శించారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ ఒగ్గు తిరుపతి, చాకలి ఆగయ్య, ముదిరాజు సంఘం మాజీ అధ్యక్షుడు కంకణాల పెద్ద బాలయ్య, కొండె రాజిరెడ్డి, పద్మారెడ్డి, బుసబోయిన స్వామి, రామరాజు, దేవరాజు, పర్శరాం యాదవ్, స్వామి యాదవ్, సత్తు విష్ణువర్ధన్‌రెడ్డి, బాలు తోపాటు దుబ్బాకలోని 17,19 వార్డులు, పద్మనాభంపల్లికి చెందిన పలువురు నాయకులు, యువకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ.. హరీశ్‌రావు దుబ్బాకపై సవతితల్లి ప్రేమ చూపిస్తాడని ఆరోపించారు. దుబ్బాకలో హరీశ్, కేటీఆర్, కేసీఆర్‌లు కలిసి వచ్చినా చైతన్యవంతులైన ఇక్కడి ప్రజలు బీజేపీనే గెలిపిస్తారన్నారు. దుబ్బాకపై తనకున్న ప్రేమ హరీశ్‌కెందుకుంటదని, నియోజకవర్గ అభివృద్ధికి రావాల్సిన నిధులపై అసెంబ్లీలో చాలాసార్లు ప్రశ్నించానని గుర్తు చేశారు. తాను ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతూ మళ్లీ ఓటేసి గెలిపిస్తామంటూ ఆశీర్వదిస్తున్నారన్నారు. బీఆర్ఎస్‌పై నమ్మకం లేక అనేక గ్రామాల నాయకులు బీజేపీలో చేరుతున్నారన్నారు.



తొగుట మండలంలోని ఘనపురంలో..

నిర్వాసితులకు అండగా ఉంటా

తొగుట(దుబ్బాక): మల్లన్న సాగర్ నిర్వాసితులకు పరిహారం కోసం ప్రభుత్వంతో పోరాడానని రఘునందన్‌రావు తెలిపారు. మండలంలోని ఘనపురం, కాన్గల్ గ్రామాల్లో సోమవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ నిర్వాసితులకు ప్రభుత్వం పరిహారం చెల్లించకుండా అనేక ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. ఇందుకోసం తాను శాసనసభలో ప్రభుత్వాన్ని నిలదీశానన్నారు. ఓపెన్ కెనాల్ నిర్మాణంలో భూమి కోల్పోయిన తుక్కాపూర్, ఘనపురం, బండారుపల్లి, ఎల్లారెడ్డిపేట రైతులకు తాను ముందుండి పరిహారం అందించానన్నారు. మల్లన్న సాగర్ నిర్మాణంతో మండలంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వంతో పోరాడానన్నారు. మెట్టు నుంచి చందాపూర్ వరకు, మెట్టు నుంచి అల్వాల వరకు రోడ్డు నిర్మాణం చేయించినట్లు చెప్పారు. దుబ్బాక నిధులు సిద్దిపేటకు తరలించుకుపోతున్నారని ఆరోపించారు. మరోసారి నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే దుబ్బాకను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కాంగ్రెస్, బీఆర్ ఎస్ నాయకుల మాయమాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం, సర్పంచ్ నర్సింలు యాదవ్, ఉప సర్పంచ్‌లు శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, విభీషణ్‌రెడ్డి పాల్గొన్నారు.



బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

కేసీఆర్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి

దౌల్తాబాద్(దుబ్బాక): బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క దళిత ఎమ్మెల్యేకు కూడా మంత్రి పదవి ఇవ్వలేదని, అలాంటి సీఎం కేసీఆర్‌కు ఓటుతోనే బుద్ధి చెప్పాలని రఘునందన్‌రావు కోరారు. సోమవారం మండల పరిధిలోని గోవిందాపూర్, గువ్వలేగి, ఉప్పరపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా సీఎం కేసీఆర్.. మద్యం షాపులకు అధిక ప్రాధాన్యతనిచ్చారని విమర్శించారు. బీసీ బంధు పేరుతో బీసీలను మోసం చేశారన్నారు. రెండుసార్లు అధికారం చేపట్టిన కేసీఆర్ నిరుపేదలకు ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో కిషన్, భూపాల్‌రెడ్డి, రామస్వామిగౌడ్, ప్రసాద్‌రావు, స్వామి, నర్సింహులు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ

నిర్భయంగా ఓటేయాలి



కొమురవెల్లిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కొమురవెల్లి(సిద్దిపేట): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు కొమురవల్లిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సోమవారం మల్లన్న ఆలయ పరిసరాలతో పాటు మండల కేంద్రంలోని వీధులలో కవాతు చేపట్టారు. అనంతరం చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలలో ఓటర్లు తమ ఓటు హక్కు నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధం అని.. దాని ద్వారా మంచి నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉందన్నారు. ఓటు విషయంలో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కొమురవెల్లి, చేర్యాల ఎస్ఐలు నాగరాజు, భాస్కర్‌రెడ్డి, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

రూ.లక్ష రుణమాఫీ ఏమైంది?



ప్రచార రథాన్ని అడ్డుకుని వాగ్వాదానికి దిగిన రైతులు

బీఆర్ఎస్ ప్రచార రథాన్ని అడ్డుకున్న రైతులు

నంగునూరు(సిద్దిపేట): లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని ప్రకటించి ఐదేళ్లు గడిచినా అమలు చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ప్రచార రథాన్ని రైతులు అడ్డుకున్నారు. ఈ సంఘటన సోమవారం నంగునూరు మండలం వెంకటాపూర్‌లో చోటు చేసుకుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రచార రథంతో గ్రామానికి చేరుకున్న బీఆర్ఎస్ నాయకులను అదే పార్టీకి చెందిన రైతులు అడ్డుకుని లక్ష రుణమాఫీ ఎందుకు చేయలేదని నిలదీశారు. రుణమాఫీ చేయకుండా.. ఇప్పుడు ఓట్ల కోసం ఎందుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఒకే కుటుంబంలో నలుగురికి బీసీ బంధు ఇచ్చారని, మేము అర్హులం కాదా అని నిలదీయంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగి తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. రాజగోపాల్‌పేట ఎస్ఐ మోహన్‌రెడ్డి అక్కడికి చేరుకొని ఎన్నికల ప్రచారానికి వచ్చే పార్టీలను అడ్డుకోవద్దని రైతులకు నచ్చజెప్పారు.

పటిష్ట బందోబస్తు మధ్య ఎన్నికలు



మాట్లాడుతున్న సీపీ శ్వేత

దుబ్బాక: ఈ నెల 30వ తేదీన జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని సీపీ ఎన్.శ్వేత అన్నారు. సోమవారం దుబ్బాక సీఐ కార్యాలయంలో పోలీస్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి ఎన్నికల విధి విధానాల గురించి దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. క్రిటికల్, నాన్ క్రిటికల్, క్రైం జోవర్లు, సీజ్ చేసిన డబ్బులు, నాన్ బెయిలబుల్ వారెంట్, ఎగ్జిగ్యూటివ్, ప్రయివేటు గన్ డిపాజిట్, ఫ్లాగ్ మార్చ్, తదితర అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా సంబంధిత రెవెన్యూ అధికారులతో కలిసి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. శాంతియుత, ప్రశాంత వాతవరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరు సమష్టిగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల పై సామాన్యులకు నమ్మకం కలిగేలా పోలీసులు ముఖ్య పాత్ర వహించాలన్నారు. కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ నోడల్ అధికారి చంద్రశేఖర్, ఏసీపీ సురేందర్‌రెడ్డి, సీఐ కృష్ణ, ఎస్సైలు గంగరాజు, నరేష్, భువనేశ్వర్ రావు, తదితరులున్నారు.

పార్ట్ టైం జాబ్ పేరుతో మోసం

సైబర్ వలలో ఇద్దరు ప్రైవేట్ ఉద్యోగులు

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ పేరుతో వచ్చిన మెసేజ్ కు స్పందించి ఇద్దరు ప్రైవేట్ ఉద్యోగులు సైబర్ వలలో చిక్కుకున్నారు. ఒకరు రూ.3 లక్షల 55 వేలు, మరొకరు రూ.7 లక్షల 48 వేలు మోసపోయిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు. అమీన్‌పూర్ పరిధిలోని బంధన్ కొమ్ము కృష్ణ బృందావన్ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి పార్ట్‌టైం జాబ్ పేరుతో నవంబర్ 2న మెసేజ్‌కు వచ్చింది. దీనికి స్పందించిన అతను తన వివరాలను నమోదు చేసి నగదు పెడుతూ అపరిచిత వ్యక్తి ఇచ్చిన టాస్క్‌లు పూర్తి చేశాడు. మొత్తం మూడు లక్షల 55 వేలు పెట్టాడు. తాను పెట్టిన నగదు తో పాటు కమిషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితుడు మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి సోమవారం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

అమీన్పూర్ పరిధిలోని బీరంగూడ జయ లక్ష్మి నగర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి పార్ట్‌టైం ఉద్యోగం పేరిట నవంబర్ 4వ తేదీన మెసేజ్ వచ్చింది. దానికి స్పందించి తన వివరాలను నమోదు చేశాడు. అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా ముందుగా రూ.2000 చెల్లించి, టాస్కులు చేస్తూ వచ్చాడు. అయితే అపరిచిత వ్యక్తి పెట్టిన నగదును, వచ్చిన కమిషన్లు క్రియేట్ చేసిన వాలెట్ లో చూపిస్తూ వచ్చాడు. చివరికి దీంతో తాను పెట్టిన రూ.ఏడు లక్షల 48 వేలతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు.. ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం సోమవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

